సినట్టున్నాడు. ఆ శబ్దాన్ని పుట్టించిన తన గొప్పద నాన్ని చుట్టూవున్న వాళ్ళు పరికిస్తున్నారా లేదా అని మెరిసే కళ్ళతో చుట్టూతా చూస్తూ ఆ కుర్రాడు. అరె! ఆ చెక్స్ షర్ట్‌లు వెళ్ళిపోయాయన్న మాట. 'ఆలోచనల్లో వేగిపోయానేకానీ, ఏమీ చేయలేకపోయానన్న బాధ రేఖ ముఖంలో ప్రతిఫ లించింది. ప్చ్. వూరికే అన్నారా! ఈ రైలెప్పుడూ జీవితకాలం లేటూ! అని' గుర్తు చేసుకుంటూ బ్యాగ్ సర్దుకుంది, తన స్టేషన్ వస్తున్న విషయం గమనించి.

**-నాగపద్మిని**

# ఓదార్పు

**"మమ్మీ ఈసారి సైన్సులో మార్కులు తక్కువగా వచ్చాయి మమ్మీ" ప్రోగ్రెస్ రిపోర్ట్ తల్లి చేతికిస్తూ దిగాలుగా అంది ప్రియ.**

**"ఏమిటే ఈ మార్కులు ఇంత తక్కువగా వచ్చాయి" కోపంగా అడిగింది వసుంధర.**

''మమ్మీ చెస్ టోర్నమెంట్ వుండటం వలన చెస్ ప్రాక్టీస్ చేస్తూ సరిగ్గా చదవలేకపోయాను'' అంది తొమ్మిదవ తరగతి చదువుతున్న ప్రియ.

''నీకు ఆటల్లో వుండే శ్రద్ధ చదువులో వుండటం లేదే'' కసురుకుంది వసుంధర.

''మమ్మీ మరోసారి మంచి మార్కులు తెచ్చుకుంటాను మమ్మీ'' బ్రతిమాలుతున్న ధోరణితో అంది.

''ఒళ్ళు దగ్గర పెట్టుకుని చదివితే ఎందుకు రావే మార్కులు'' ప్రోగ్రెస్ కార్డ్ విసురుగా ప్రియ చేతిలో పెట్టింది. తల్లి గట్టిగా మందలించేసరికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి ప్రియకు.

''పోనీలే వసూ, చెక్ ప్రాక్టీస్ చేస్తే మంచిదే. టోర్నమెంట్‌లో గెలిస్తే మంచి పేరు వస్తుంది'' అన్నాడు వసుంధర భర్త ప్రసాద్.

''మీరిలా ప్రతిదానికి వెనకేసుకు రాబట్టే అదిలా చదువులో వెనకపడుతోంది'' కోపంగా భర్తమీద కేకలేసింది.

''సర్లే వూరుకో. తను ఎప్పుడూ మంచి మార్కులే తెస్తుంది కదా. ఈసారికి వదిలేయి'' భార్యని మందలించాడు. భర్త వంక కోపంగా చూస్తూ లోపలికెళ్ళిపోయింది. అమ్మ తిట్లు తిని అలసిపోయిన ప్రియ నెమ్మదిగా జారుకుంది. లోపల పనిచేసుకుంటున్న భార్య దగ్గరకు వచ్చాడు ప్రసాద్.

''వసూ, పిల్లల్ని అలా కోప్పడితే ఎలా చెప్పు. వాళ్ళకి మెల్లగా సర్దిచెప్పి, మనమే చక్కగా తీర్చిదిద్దుకోవాలి. అలా కసురుకుంటే వాళ్ళు మెంకిగా తయారవుతారు. ప్రియ మొద్దుపిల్ల కాదు. చక్కగా చదువుతుంది. ఈసారి కాకపోతే మరోసారి మంచి మార్కులు తెచ్చుకుంటుంది. నువ్వు కోప్పడినందుకు చూడు తన ముఖం ఎలా పాలిపోయిందో'' సర్ది చెబుతున్న భర్త వంక సూటిగా చూసి మౌనంగా వుండిపోయింది.

★ ★ ★

''ఏయ్ వసూ! నువ్వు రాసిన కథ తిరిగి వచ్చేసింది'' నవ్వుతూ భార్య చేతిలో కవరు పెట్టి ఆఫీసుకు వెళ్ళిపోయాడు ప్రసాద్. తను రాసిన కథ తిరిగి వచ్చినందుకు బాధగా అనిపించింది వసుంధరకు. కథ తిరిగి వచ్చిందన్న బాధ కన్నా తన భర్త వెటకారంగా నవ్వినందుకు మనసు చివుక్కుమంది. 'నీకెందుకోయ్, కథలు కాకరకాయలు, ఇంట్లో పని చూసుకోకుండా' అన్నట్టుంది ఆ నవ్వుకు అర్థం. తనకు కథలు రాయాలని ఆసక్తి వుండటంతో రాసి పంపింది. ఫలితంగా అది తిరిగి వచ్చింది. ఆలోచిస్తూనే వంటయిందనిపించి అలసటగా వచ్చి సోఫాలో కూర్చుండిపోయింది. ఇంతలో ప్రియ స్కూలు నుండి వచ్చి బ్యాగ్ టేబిల్ మీద పెట్టి అమ్మ దగ్గరకు వచ్చి కూర్చుంటూ ''ఏమిటి మమ్మీ డల్‌గా వున్నావు'' అనడిగింది.

''ఏమీ లేదు'' మెల్లగా జవాబిచ్చింది.

''ఏం మమ్మీ ఒంట్లో బాగాలేదా'' ఆప్యాయంగా అడిగింది.

''ఏం లేదమ్మా నేను రాసిన కథ తిరిగి వచ్చేసింది'' అంది.

''ఓ అదా టేకిటీజీ మమ్మీ. ఈసారి కాకపోతే మరోసారి తప్పకుండా పడుతుంది. తిరిగి వచ్చేసిందని నువ్వు రాయటం మానేయకు, నీ ప్రయత్నం నువ్వు చెయ్యి. బెటర్ లక్ నెక్స్ట్ టైమ్. నువ్వు అలా డల్‌గా వుంటే బాగుండదు మమ్మీ'' ఆప్యాయంగా తల్లి భుజం నొక్కుతూ అంది. వసుంధరకు తన కూతురిచ్చిన ఓదార్పు వేసవితాపంలో చల్లటి గాలిలా తగిలింది. వసుంధరకు నిన్న జరిగింది గుర్తుకు వచ్చింది. నిన్న మార్కులు తక్కువ వచ్చాయి అని తను అన్నప్పుడు ఇదే ఓదార్పు తనిచ్చివుంటే, ఎంత సంతోషపడేదో. చిన్నపిల్లకున్న ఇంగితం కూడా తనకు లేకపోయినందుకు, బాధపడింది. శ్రీవారు వెక్కిరింతగా నవ్వటం తప్పుకాదనిపించింది వసుంధరకు, ఆ సమయంలో.

పెద్దవాళ్ళు పిల్లలకు నీతులు చెబుతుంటారు. కానీ ఒక్కోసారి ఆ పెద్దవాళ్ళే పిల్లల దగ్గర కొన్ని విషయాలు నేర్చుకోవాల్సి వుంటుంది అనుకుంది. ఇప్పుడు వసుంధరకు కథ తిరిగి వచ్చిందన్న బాధకంటే, తన కూతురిచ్చిన ఓదార్పు వేయిరెట్లు సంతోషం కలిగించింది. నవ్వుతూ ఆప్యాయంగా కూతురి బుగ్గ నిమిరింది. తల్లిముఖంలో సంతోషం కనిపించటంతో లేడిలా గెంతుతూ తుర్రున పారిపోయింది ప్రియ.

**-ఎస్.కె.నన్ని (శ్రీకాళహస్తి)**




